క్లుప్తంగా

రహదారి నిర్మాణానికి శంకుస్థాపన

బిక్కవోలు: కాపవరం గ్రామంలోని రహదారి నిర్మాణానికి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. కాపవరం నుంచి దుప్పలపూడి వరకు రూ.2 కోట్ల నాబార్డ్ నిధులతో ఈ రోడ్డు పనుల చేయనున్నారు. ఈ కాపవరం, దుప్పలపూడి నాయకులు పాల్గొన్నారు.

వినాయక చవితి ఉత్సవాలకు రాట ముహూర్తం



పందిరి రాట ముహూర్తం చేస్తున్న వెంకటరెడ్డి, భక్తులు

పెదపూడి: వినాయక చవితి ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో, ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్వహించుకోవాలని జి.మామిడాడకు చెందిన అమ్మిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, ప్రముఖ దాత ద్వారంపూడి వెంకటరెడ్డి (చింతపల్లి) అన్నారు. జి.మామిడాడ బోడవారి వీధిలోని అభయ గణపతి ఆలయం వద్ద ఈ నెల 27న జరిగే వినాయక చవితి వేడుకలకు సంబంధించి సోమవారం పందిరి రాట ముహూర్తం చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది భారీ ఎత్తున చవితి వేడుకలు నిర్వహించడానికి అన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఉదయం స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మేడపాటి సాయిబాబా రెడ్డి, ఆలయ కమిటీ ప్రతినిధులు ద్వారంపూడి బంగారెడ్డి, కర్రి గంగాధరరెడ్డి, ద్వారంపూడి రవితేజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సారా స్థావరాలపై దాడులు



నిందితులను అదుపులోకి తీసుకుంటున్న ఎక్సైజ్ సిబ్బంది

రంగంపేట: స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మర్రిపూడి, దొడ్డిగుంట గ్రామాల్లో సారా స్థావరాలపై దాడులు నిర్వహించినట్టు ఎక్సైజ్ సీఐ సుధ తెలిపారు. ఈ దాడుల్లో అక్రమంగా సారా విక్రయిస్తున్న జీలం వెంకన్నబాబు, మల్లెల నాగమణిలను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించామన్నారు.

త్రిసభ్య కమిటీల నియామకం

పెదపూడి: మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (పీఏసీఎస్)కు త్రీ సభ్య కమిటీల నియామకం జరిగిందని జిల్లా సహకారశాఖ అసిస్టెంట్ రిజిస్టర్ జె.కామేశ్వరరావు అన్నారు. ఆయన సోమవారం పెదపూడి డీసీసీబీలో మాట్లాడుతూ అచ్యుతాపురత్రయం (ఏపీత్రయం), పెదపూడి, పైన, కాండ్రేగుల, కుమారప్రియం మొత్తం ఐదు పీఏసీఎస్‌లు ఉన్నాయన్నారు. వాటిలో ఏపీత్రయానికి కోలా సత్యనారాయణ, పెదపూడికి పుట్టా గంగాధర్ చౌదరి, పైన పీఏసీఎస్‌కు తిబిరిశెట్టి ఆదినారాయణ, కాండ్రేగులకు పేకేటి మాధవరావులను చైర్‌పర్సన్లుగా నియమించారన్నారు. ఈ మేరకు ప్రభుత్వ ఉత్తర్వులు అందాయన్నారు.

రాపాక రహదారి నిర్మాణానికి శంకుస్థాపన

సీతానగరం: మండలంలోని రాపాక – కోటికేశవరం రహదారి నిర్మాణానికి ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణచౌదరి సోమవారం శంకుస్థాపన చేశారు. రాజమహేంద్రవరం – సీతానగరం ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి మూడు కిలోమీటర్లు తారు రోడ్డుకు ఎండీఆర్ ప్లాన్ నిధులు రూ.1.25 కోట్లు కేటాయించారని ఆర్ అండ్‌బీ డీఈఈ పి.సాయిసతీష్ తెలిపారు. అనంతరం ఎంపీడీఓ ఎం.భారతి, తహసీల్దార్ ఎ.శ్రీనివాస్, మండల స్థాయి అధికారుల ఆధ్వర్యంలో రాపాకలో జరిగిన హర్ ఘర్ తరంగ కార్యక్రమంలో ఎమ్మెల్యే, రుడా చైర్మన్ పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించాలి

అనపర్తి: ముందస్తు జాగ్రత్తలు తీసుకుని పండగను ఆనందమయం చేసుకుందామని ఎస్సై ఎల్.శ్రీను నాయక్ అన్నారు. వినాయక చవితి సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సోమవారం పులగుర్తలో కార్యక్రమం నిర్వహించారు. వినాయక చవితిని పురస్కరించుకుని అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

గాంధీ విగ్రహం ధ్వంసం

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు మసీదువీధి చివరలో ఉన్న మహాత్మా గాంధీజీ విగ్రహాన్ని ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తి సిమెంటు ఇటుకతో కొట్టి ధ్వంసం చేశాడు. మాజీ ఉప సర్పంచ్ కామిని ప్రసాద్ చౌదరి ఫిర్యాదు మేరకు బొమ్మూరు ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్, ఎస్సై అంకారావు సోమవారం సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. గాంధీజీ విగ్రహానికి సమీపంలోని సీసీ కెమెరా పుటేజీని పరిశీలించగా ఆదివారం అర్ధరాత్రి 1.24 గంటల సమయంలో నల్లకారు నుంచి ఒక వ్యక్తి దిగి సిమెంటు ఇటుకతో గాంధీజీ విగ్రహాన్ని ధ్వంసం చేసినట్టు గుర్తించారు.

ఉపాధిలో ట్రబుల్ క్లిక్!

- ఉపాధి కూలీలకు కొత్త విధానం
- ఫొటోలతో హాజరు నమోదు
- రెండు పూటలా అప్‌లోడ్ చేయాలి
- కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు
- వ్యతిరేకిస్తున్న కూలీలు



రంగాపురంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

బిక్కవోలు: ఉపాధి హామీ కూలీల హాజరు నమోదు కోసం కేంద్ర ప్రభుత్వం కొత్త విధానాన్ని ప్రవేశ పెట్టింది. ఇక నుంచి ఉపాధి హామీ పనులు చేసే కూలీలకు ఉదయం, మధ్యాహ్నం ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాలని ఉత్తర్వులు తీసుకొచ్చింది. ఇలా రెండు పూటాల ఫొటోలు అప్‌లోడ్ చేస్తేనే వారికి కూలి అందుతుంది. కేంద్రం తీసుకొచ్చిన ఈ విధానం నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం (ఎన్ఎంఎంఎస్)యాప్ ద్వారా ప్రతి రోజు కూలీల ఫేస్ రికగ్నైజేషన్ చేసి హాజరు తీసుకుంటారు. గతంలో పనికి ఆలస్యంగా వచ్చినా, ముందు వచ్చినా సమానంగా కూలి తీసుకునే వారు. దీని వల్ల హాజరు విధానం దుర్వినియోగమవుతోందని కేంద్రమంత్రిత్వ శాఖ దృష్టికి వెళ్లింది. దీంతో ఇటువంటి మోసాన్ని అరికట్టేందుకు తగిన చర్యలు చేపట్టారు. ఉపాధి హామీలో కొత్తగా ప్రవేశపెట్టిన హాజరు విధానాన్ని గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శి నుంచి రాష్ట్ర స్థాయిలో కమిషనర్ వరకూ తనిఖీలు చేయాలి. తీసిన ఫొటోలను మండల స్థాయిలో అధికారుల ఆదేశాల మేరకు డీఆర్‌డీఏకు కలెక్టర్‌కు పంపించాల్సి ఉంటుంది.

వ్యతిరేకిస్తున్న కూలీలు

ఉపాధి హామీ నూతన హాజరు విధానాన్ని కూలీలు వ్యతిరేకిస్తున్నారు. రెండు పూటలా ఫొటోలు తీయాలంటే ఇబ్బందులు ఎదురవుతాయని చెబుతున్నారు. ఈ నిబంధనలను అటు కూలీలతో పాటు ఉపాధి హామీ సిబ్బంది కూడా వ్యతిరేకిస్తున్నారు. ఈ కొత్త హాజరు విధానం వల్ల ఉపాధి పనులు హాజరయ్యే వారి శాతం తగ్గి పోయే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు.

నియోజకవర్గంలో వివరాలు

మండలం	జాబ్ కార్డులు	లబ్ధిదారులు	ఫీల్డ్ అసిస్టెంట్	మేట్లు
అనపర్తి	8,490	12,827	11	51
బిక్కవోలు	11,442	18,987	13	84
రంగంపేట	12,709	18,570	17	75
పెదపూడి	13,586	23,356	18	109
మొత్తం	46,227	73,740	79	319

శిక్షణ పూర్తి చేశాం



ఇప్పటికే ఉపాధి హామీ క్షేత్ర స్థాయి సిబ్బందికి శిక్షణ పూర్తి చేశాం. ఫీల్డ్ అసిస్టెంట్ పాటు మేట్లకు ఫొటో తీయడం జరుగుతుంది. దీనివల్ల ఎలాంటి ఇబ్బంది ఉండదు. ప్రభుత్వం నిబంధనల ప్రకారం పనులు జరుగుతాయి.

– నాగేంద్ర ప్రసాద్, ఇన్‌చార్జి ఎంపీడీవో, బిక్కవోలు

నాలుగు లేన్ల రోడ్డు అడిగితే.. అరెస్టు చేశారు

- నాలుగు లేన్ల రోడ్డు వేయాలని నిరసన
- వైఎస్సార్ సీపీ నాయకుల అరెస్టు
- కూటమి ప్రభుత్వ తీరుపై విమర్శలు





రఘుదేవపురంలో వైఎస్సార్ సీపీ నాయకులను బలవంతంగా జీపులోకి ఎక్కిస్తున్న పోలీసులు

సీతానగరం: రఘుదేవపురం నుంచి సీతానగరం వరకూ అసంపూర్తిగా ఉన్న రోడ్డు భాగాన్ని నాలుగు లేన్ల రహదారిగా నిర్మించాలని వైఎస్సార్ సీపీ నాయకులు స్పష్టం చేశారు. ఆ భాగాన్ని 30 అడుగుల తారు రోడ్డుగా వేసేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నించడాన్ని అడ్డుకున్నారు. ఈ మేరకు సోమవారం రఘుదేవపురం వద్ద రోడ్డు పనులు ప్రారంభిస్తున్నారన్న సమాచారం రావడంతో పెద్ద సంఖ్యలో అక్కడకు తరలివెళ్లారు. కానీ రోడ్డు పనులు మొదలుపెట్టకపోవడంతో, స్థానిక ఎమ్మెల్యే బలరామకృష్ణ రాపాక గ్రామానికి వస్తున్నారని తెలిసి రోడ్డుపై నిరసన చేపట్టారు. దీనితో ఎస్సై డి.రామ్ కుమార్ తన సిబ్బందితో పాటు రాజమహేంద్రవరం నుంచి స్పెషల్ ఫోర్స్‌ను రప్పించారు. వైఎస్సార్ సీపీ నాయకులను అదుపులోకి తీసుకుని పోలీస్ కారులోకి బలవంతంగా ఎక్కించారు. పార్టీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్ బాబు, మండల సర్పంచ్ సంఘం అధ్యక్షుడు కోండ్రపు ముత్యాలు, వైస్ ఎంపీపీ 1 ముదునూరి సురేష్ రాజు, యువజన విభాగం రాష్ట్ర జనరల్ సెక్రటరీ చేకూరి నాని, ఎంపీటీసీ నల్లమోలు భాస్కర్, ఉప సర్పంచ్ ద్వారంపూడి రామకృష్ణ, పార్టీ నాయకులు పిండి రాధాకృష్ణ, ముదునూరి రామరాజు, గుర్రాల స్వామి, పిచ్చుకల విజయ్ కుమార్‌లను పోలీసులు అదుపులోకి తీసుకుని బలవంతంగా జీప్‌లోకి ఎక్కించి, రఘుదేవపురం నుంచి నేరుగా గోకవరం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సమాచారం అందుకున్న సీతానగరం, కోరుకొండ, రాజానగరం, గోకవరం లోని వైఎస్సార్ సీపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు.

కూటమి నేతల పిరికి చర్య

ఇనుగంటివారిపేట సర్పంచ్ సత్యం రాంపండు విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే, కూటమి నాయకులు కలిసి నాలుగు లేన్ల రోడ్డు వేయలేక పోతున్నారని ఎద్దేవా చేశారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నాయకులను అరెస్ట్ చేయడం పిరికి చర్య అని దుయ్యపట్టారు. చేతనైతే రఘుదేవపురం నుంచి సీతానగరం రెండు కిలోమీటర్ల మేర నాలుగు లేన్ల రోడ్డు వేయాలని, లేకుంటే అలాగే వదిలేయాలన్నారు. ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న మాట్లాడుతూ రూ.104 కోట్లతో నాలుగు లేన్ల రోడ్డును కాతేరు నుంచి రఘుదేవపురం వరకూ వేస్తే, అక్కడి నుంచి రెండు కిలోమీటర్లు రోడ్డు వేయలేని దుస్థితిలో కూటమి నాయకులు ఉన్నారన్నారు. చిన కొండేపూడి ఉప సర్పంచ్ చేకూరి సత్తిపండురాజు మాట్లాడుతూ అధికారం ఉందని అక్రమ అరెస్టులు చేయించడం సరైన విధానం కాదన్నారు. వైఎస్ ఎంపీపీ 2 సత్యం మదన్‌బాబు, పైడి రాజు, వలవల సత్తిబాబు, జొన్నలగడ్డ సత్యనారాయణ, కవల కృష్ణమూర్తి, పట్టపగల ప్రసాద్, దివాకర్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

నమ్మకం, విశ్వాసంతో ఆధ్యాత్మిక సాధన



సత్యసాయి వార్షికోత్సవ సభలో మాట్లాడుతున్న ప్రసాద్

రంగంపేట: నమ్మకం, విశ్వాసంతోనే ఆధ్యాత్మిక సాధన చేయాలని సత్యసాయిబాబా భక్తుడు వీఎస్ ఆర్‌కే ప్రసాద్ అన్నారు. కొత్త కోటపాడులో సత్య సాయి సేవా సదన్ 30వ వార్షికోత్సవం సందర్భంగా సేవా సమితి కన్వీనర్ కె.వెంకట అమరనాథ్ అధ్యక్షతన సోమవారం ఆధ్యాత్మిక సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రసాద్ మాట్లాడుతూ సత్యసాయి సేవాసంస్థలను బాబా స్థాపించి, సమాజానికి అందజేశారన్నారు. సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు బులుసు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలలో నిర్వహించే వంద కార్యక్రమాల్లో కొన్నయినా ఆచరించి, ధన్యజీవులు కావాలన్నారు. అంతకు ముందు జరిగిన హోమియో శిబిరంలో డాక్టర్ శ్యామ్ కుమార్ వైష్ణవ్.. రోగులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. విభూతి వైష్ణవ్ కుటుంబ సభ్యుల సత్యసాయి భజన గానామృతం అందరినీ అలరించింది. స్థానిక కన్వీనర్ కందర్ప వెంకట అమర్నాథ్ ప్రశాంతి పతాకను ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. బాబా చిత్రపటానికి, పాదుకులకు కన్వీనర్ కందర్ప అమర్నాథ్, జిల్లా వేదాధ్యయన సమన్వయ కర్త కందర్ప శ్రీరామశర్మ ప్రత్యేక పూజలు చేశారు. రంగంపేట సబ్ జోన్ విద్యా విభాగ సమన్వయకర్త కందర్ప భానుమతి ఆధ్వర్యాన బాలవికాస్ విద్యార్థుల సత్యసాయి నవరత్న మాలిక పఠనం, కందర్ప శ్రవ్యాన్ భజన పాట భక్తుల్ని పారవశులను చేసింది. విజయవాడ శ్రీ చైతన్య కళాశాల సంస్కృత ఉపన్యాసకులు కందర్ప రాంబాబు మాస్టారు ఆధ్వర్యంలో సత్యసాయి భజన పాటల అత్యాక్షరి జరిగింది.

ప్రపంచ అగ్రగామి దేశంగా భారత్



సీతానగరంలో హర్‌ఘర్ తిరంగా బైక్ ర్యాలీ

సీతానగరం: ప్రపంచంలో అగ్రగామి దేశంగా భారతదేశం అవతరించబోతోందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏపీఆర్ చౌదరి అన్నారు. సోమవారం బొబ్బిల్లంక నుంచి సీతానగరం వరకు హర్ ఘర్ తిరంగ్ కార్యక్రమంలో భాగంగా జాతీయ జెండాలతో బైక్ ర్యాలీ నిర్వహించారు. బీజేపీ నాయకత్వంలో దేశ ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో శక్తివంతమైన దేశంగా అవతరించబోతోందన్నారు. మనదేశం ఆర్థిక, సైనికపరంగా ప్రపంచంలో నాలుగో స్థానంలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షురాలు రాపాక వెంకటలక్ష్మి, పాలడుగుల శ్రీవిద్య, మద్దాల కొండలరావు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ భారతి, ఎంఈఓ స్వామినాయక్ తదితరులు

సీతానగరం: గ్రామాల్లో ప్రభుత్వ, ప్రైవేట్‌య పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, కళాశాలల్లో మంగళవారం నులి పురుగల నివారణ కార్యక్రమంలో భాగంగా ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తున్నట్టు స్థానిక పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ యేసు రాణి తెలిపారు. సోమవారం సీతానగరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఎం.భారతి, ఎంఈఓ కె.స్వామినాయక్ చేతుల మీదుగా నులిపురుగల నివారణ కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ యేసురాణి మాట్లాడుతూ 69 అంగన్‌వాడీ కేంద్రాలు, 76 ప్రైవేట్, ప్రభుత్వ స్కూల్స్, నాలుగు కళాశాల్లో 11,368 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ వైఎస్ రాయుడు, పీఎస్ఎన్ కె.ఆదిలక్ష్మి, ఏపీవో బీవీ సత్యవతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.పెదలక్ష్మి, నందీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

విద్యుత్‌కు నేడు అంతరాయం

రాజానగరం: సంపత్‌నగరం విద్యుత్ సబ్‌స్టేషను పరిధిలోని బొమ్మూరు–శ్రీకృష్ణపట్నం 33 కేవీ ఫీడర్‌లో వార్షిక మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఇన్‌చార్జి నటరాజన్ సోమవారం తెలిపారు. మండలంలో శ్రీకృష్ణపట్నం, భూపాలపట్నం, పుణ్యక్షేత్రం, నామవరం, జి.యర్రంపాలెం, రాధేయపాలెం, శ్రీరామపురం, రఘునాథపురం, పాతతుంగపాడులకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

పెదపూడి: మండలంలోని శహపురం, సంపర, కాండ్రేగుల, చింతపల్లి, పుట్టకొండ గ్రామాల్లో మంగళవారం ఉదయం 7.30 నుంచి 9.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ కాకినాడ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్. ఉదయ భాస్కర్ తెలిపారు. వార్షిక మరమ్మతుల నేపథ్యంలో ఈ అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పొక్లెయిన్లు, టిప్పర్ల సీజ్

రాజానగరం: పాతతుంగపాడులో అక్రమంగా మట్టి తవ్వకాలు చేస్తున్న రెండు చైన్ మౌంటెడ్ పొక్లెయిన్లు, రెండు టిప్పర్లను అధికారులు సోమవారం సీజ్ చేశారు. జిల్లా గనులు, భూగర్భ శాఖ అధికారి డి.ఫణిభూషణ్‌రెడ్డి, రెవెన్యూ అధికారులు, సిబ్బందితో కలసి నిర్వహించిన తనిఖీల్లో వీటిని పట్టుకుని సీజ్ చేశారు. ఈ ప్రాంతంలో అక్రమ మట్టి తవ్వకాలు జరగకుండా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



పాతతుంగపాడులో జరుగుతున్న మట్టి తవ్వకాలను అడ్డుకున్న అధికారులు

పీహెచ్‌సీ పరిశీలన



రంగంపేట హైస్కూల్‌ను పరిశీలిస్తున్న రీజనల్ డైరెక్టర్ పద్మ శశిధర్ తదితరులు

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం వైద్యశాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ పద్మ శశిధర్, అడిషనల్ డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ పి.సరిత, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డీఐఓ) డాక్టర్ కోమల పరిశీలించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో రికార్డులను, పరిసరాలను తనిఖీ చేశారు. అనంతరం నేషనల్ డీ వార్మిగ్ డే సందర్భంగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వడిశలేరు గ్రామంలో పర్యటించనున్న నేపథ్యంలో పీహెచ్‌సీ పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వడిశలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఏడబ్ల్యూసీ సెంటర్‌లో చేసిన ఏర్పాట్లను వారు పరిశీలించారు. ఆరోగ్య శాఖ మంత్రి పర్యటన విజయవంతం చేయాలని సూచించారు. పీహెచ్‌సీ వైద్య సిబ్బందికి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు బి.వేణుశ్రీలక్ష్మి, కె.చిన్నారావు, ఎంపీహెచ్ఈఓ వి.తులసీదాస్, పీహెచ్ఎన్ కె.మేరీ హెలెనా, ఎంపీహెచ్ఎస్ కె.రామ్మోహన్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బులిస్వామిరెడ్డి దాతృత్వం ఆదర్శనీయం



మహిళలకు కుట్టుమెషీన్లు అందిస్తున్న డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: ఆలమూరు మండలం అర్తమూరు గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త సత్తి బులిస్వామిరెడ్డి దాతృత్వం అందరికీ ఆదర్శనీయమని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. బులిస్వామిరెడ్డి 73వ పుట్టిన రోజు, ఎస్‌బీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ 30వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం రాత్రి మహిళలకు కుట్టుమెషీన్లు, బహుమతులను ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్‌బీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా బులిస్వామిరెడ్డి మహిళలకు కుట్టుశిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసి, ఉచితంగా శిక్షణతో పాటు మెషీన్లు అందజేశారన్నారు. అలాగే 80కి పైగా వైద్యశిబిరాలు నిర్వహించారని, అనపర్తి, మండపేట, అర్తమూరు తదితర చోట్ల ట్రస్ట్ భవనాలను నిర్మించి మహిళలకు చేతివృత్తులపై శిక్షణ ఇప్పించారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ సత్తి రామకృష్ణారెడ్డి, చాణక్య నర్సింగ్ హోం అధినేత డాక్టర్ జీఎస్ఎన్ రెడ్డి, కనకరాజు స్వామి (ద్వారపూడి) తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారమే చవితి వేడుకలు



బలభద్రపురం గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై రవిచంద్రకుమార్

బిక్కవోలు: నిబంధనలు ప్రకారమే వినాయక చవితి వేడుకలు జరుపుకోవాలని ఎస్సై వాసంశెట్టి రవిచంద్ర కుమార్ తెలిపారు. సోమవారం బలభద్రపురం గ్రామంలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ రాబోయే వినాయక చవితి సందర్భంగా ప్రశాంత వాతావరణంలో చవితి వేడుకలు జరగాలన్నారు. ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ఏవిధంగా అశ్లీల ప్రోగాములు చేయకుండా కమిటీ సభ్యులు బాధ్యత తీసుకోవాలన్నారు. ఏకో ఫ్రెండ్లీ విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. 5 అడుగుల ఎత్తు కన్నా ఎక్కువ విగ్రహాలు ఉండకూడదన్నారు. మైక్, కరెంటు అనుమతులు తీసుకోవాలన్నారు. ఎటువంటి గొడవులు జరగకూడదని, పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలోని గ్రామస్తులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌కు ఎన్‌క్యూఏఎస్ ధ్రువీకరణ పత్రం



సింగవరం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎన్‌క్యూఏఎస్ టీమ్ పర్యవేక్షణాధికారి నవీన

సీతానగరం: సింగవరంలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌కు నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్ట్స్ ధ్రువీకరణ పత్రం వస్తుందని ఎన్‌క్యూఏఎస్ టీమ్ పర్యవేక్షణాధికారి డాక్టర్ కె.నవీన తెలిపారు. సోమవారం సింగవరంలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్ట్స్ టీమ్ ప్రజలకు అందుతున్న ఆరోగ్య సేవలు, అవసరమైన పరికరాలు, వాటి నిర్వహణ గురించి వర్చువల్‌గా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పర్యవేక్షణాధికారి డాక్టర్ నవీన మాట్లాడుతూ ఈ ఆరోగ్య మందిరాల ద్వారా ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించేందుకు ఆరోగ్య మందిరాలు నిర్మించిందన్నారు. 14 రకాల టెస్టులు, 105 రకాల మందులు ఇక్కడ ఉచితంగా అందుబాటులో ఉంటాయన్నారు. వీటిని ప్రజలు పూర్తిగా వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమలో పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ఏవీకే చైతన్య, పీహెచ్ఎన్ కె.ఆదిలక్ష్మి, సూపర్‌వైజర్ కె.సుధాకర్, ఎంఎల్‌హెచ్‌పీ ఎస్.సౌజన్య, ఏఎన్ఎం అరుణ, హెల్త్ అసిస్టెంట్ కిషోర్, ఆశా వర్కర్లు చెల్లాదేవి, స్వరాజ్యలక్ష్మి, విజయ తదితరులు పాల్గొన్నారు.

చవితి ఉత్సవాలకు సింగిల్ విండో అనుమతులు



ప్రశాంతి, జిల్లా కలెక్టర్, ఇన్‌చార్జ్ కమిషనర్

రాజమహేంద్రవరం సిటీ: నగరపాలక సంస్థ పరిధిలో వినాయక చవితి ఉత్సవాల నిర్వహణకు ఉత్సవ కమిటీలకు సింగిల్ విండో విధానం ద్వారా అనుమతులు మంజూరు చేస్తామని కలెక్టర్, ఇన్‌చార్జి కమిషనర్ పి.ప్రశాంతి సోమవారం ప్రకటించారు. ఈ మేరకు సోమవారం పోలీసు, రెవెన్యూ, ఫైర్, ఏపీఈపీడీసీఎల్, ఫిషరీస్, ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ కార్యాలయంలోని రెండో అంతస్తులో ఉన్న పట్టణ ప్రణాళికా విభాగంలో ఈ నెల 21 నుంచి 26 వరకూ దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా గణపతి ఉత్సవ కమిటీ సభ్యులకు ఈ కింద సూచనలు చేశారు.

- మట్టి వినాయక విగ్రహాలనే పూజించాలి. కూడళ్లు, ముఖ్యమైన రోడ్లలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగేలా మంటపాలు ఏర్పాటు చేయరాదు.
- భారీ వర్షాలు కురిసే అవకాశమున్న నేపథ్యంలో పందిళ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి.
- మంటపాల్లో మండే స్వభావం గల వస్తువులు ఉంచరాదు. ఉత్సవాల నిర్వహించే సమయంలో బాణసంచా కాల్చరాదు.
- గణపతి ఉత్సవాల నిర్వహణలో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులకు ఏ విధమైన నష్టం కలిగించరాదు. రోడ్లు, నీటి సరఫరా పైపులు, విద్యుత్ తీగలకు నష్టం వాటిల్లితే , వాటికి అయ్యే ఖర్చును కమిటీ నుంచి వసూలు చేస్తారు.
- గణపతి పందిళ్లలో ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే తక్కువ శబ్దంతో ప్రజలకు ఏ విధమైన ఇబ్బందులు లేకుండా లౌడ్ స్పీకర్ వినియోగించాలి
- విద్యాసంస్థలు, ఆసుపత్రుల పరిసర ప్రాంతాలలో గణపతి ఉత్సవాలు నిర్వహించుటకు అనుమతి జారీ చేయబడవు.
- గణపతి నిమజ్జనం జరిగే దీ, సమయం, రూటు వివరాలు కమిటీ సభ్యులు సంబంధిత డిపార్టుమెంటు వారికి ముందుగా తెలపాలి.
- పర్యావరణ పరిరక్షణ, నీటి వనరుల కాలుష్య నివారణ, పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా, పూత, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ ఇతర రసాయన పదార్థాలతో తయారు చేసిన విగ్రహాల వినియోగం పూర్తిగా నిషేధించడమైనది. మట్టి విగ్రహాల వినియోగాన్ని ప్రోత్సహిస్తూ, తగిన నియమ నిబంధనల ప్రకారం సంబంధిత ఉత్సవ కమిటీలకు మాత్రమే అనుమతులు ఇస్తారు.